# పరిచయపరిణామం

## చమడాలెక్కదీసే లౌక్యం...
## ఆవులించకుండా పేగుల్లెక్కబెట్టే సౌఖ్యం

విశాఖపట్నం:

"ఎక్స్క్యూజ్ మి... 25 నా బెర్తు"

"అవున్లెండి సార్. ఇక్కడ స్మోక్ చేస్తున్నారని లేడీస్‌కి పొగపడక కిటికీదగ్గర కూర్చున్నారు. కాసేపిక్కడ ఎడ్జస్టవండి సార్"

"నో. ఆమాత్రం దానికి మేం ట్వంటీడేస్ ముందుగా రిజర్వేషన్ చేయించుకోడమెందుకు? దయచేసి నా సీట్ నాకిప్పించండి".

"నే చెప్తూనే ఉన్నాగదండి. ఎవరి సీట్లో సుఖం ఎవరొదులుకుంటారు!. మీరన్నీ ఇలాగే చేస్తుంటారు. మీరిటు జరిగి మజ్జ సీట్లోకి రాండి. నేనా చివర గూర్చుంటాను".

"ఈ బెర్త్‌కింద సామాను కొంచెం జరపండి. ఇక్కడ నా సూట్‌కేసు పెట్టుకోవాలి".

ఎలమంచిలి:

"కాఫీ కాఫీ!"

"ఏ అబ్బాయ్ ఇటా. కాఫీ ఎంతా?"

"రెండ్రూపాయల్సార్"

"వేడిగా ఉంటుందా?"

"తాగి సూడండి సార్. వేడిగా స్ట్రాంగా ఉంటేనే డబ్బులియ్యండి"

"సరే ఇయ్యి"

"ఎన్నిసార్?"

"ఎన్నో యెందుకు? ఒకటియ్యి"

"కొద్దిగ జరగండమ్మా, కాఫీ కేన్ ఇక్కడెట్టుకుంటాను"

"మేమెందుకు జరగాల, నీ యాపారానికి?"

"అదేటమ్మా అలాగంటారు? కొంచెం ఎడ్జస్టుగావాల"

"ఆ బుద్ధి అందరికీ వుంటే బాగుండు"

"ఇదుగోసార్ కాఫీ"

"బాగుంటే చెప్పండి సార్ మేం కూడా తీసుకుంటాం".

తుని:

"తమలపాకులు, తమలపాకులు! కవటాకులు!!"

"ఆ యబ్బాయిని పిలమనండి. మవాళ్ళకి తుని తమలపాకులంటే ఇష్టం. ఓ కట్ట తీసుకుందాం"

"గురుగార్లూ కొద్దిగ కేకెయ్యండి సార్"

"ఏయ్ తమలపాకులబ్బాయి ఇటా"

"కట్ట నాలుగు రూపాయలండి చిల్లర కాయితాలుండాల, బేగి తియ్యండి ట్రెయివెలిపోద్ది"

"ఒక కట్టియ్యి"

"పది రూపాయల కాయితం ఒద్దుబాబు. సిల్లర్లేదు. ఆకులిటిచ్చేయండి. బండెల్లిపోద్ది. లేప్పోతే రొండు కట్టలుచ్చుకోండి. రెండ్రూపాయలున్నాయి నాకాడ. సరిపోద్ది"

"రెండు కట్టలు మేమేం జేసుకోం? చిల్లరుంటుంది చూడు"

"లేదు చెబుతున్నా గదండీ!"

"ఓకే ఓకే, ఉండండి నాలుగు రూపాయలు నేనిస్తాను. సామర్లకోట్లోనో రాయిమండ్రిలోనో మార్చి నాకిద్దురుగాని"

"థాంక్యూ సార్. సుజాతా నే మర్చిపోతే గుర్తుజెయ్యేంఛ్"

సామర్లకోట:

"ఎంత ఎతికినా పెరుగన్నం పొట్లాలు లేవు సుజాతా. నువ్వు ఇయాల్టికి పూరీలు తినేసుండిపోవాలి మరి, అంతే"

"ఓయమ్మో. నేను తిన్ను. పసైత్తా ఉంటానీ ఆ పూరీలు తిని దాహానికి వాలిక జిల్లార్చుకుపోయి నిద్దరట్టదు నాకు. అర్టిపళ్ళున్నాయిగదా అయ్యే రెండు తినేసూరుకుంటా".

"నేనందుకే బయల్దేరేటప్పుడు జెప్పాను. పిడికెడన్నం పాలకవర్లో ఏసి ఇన్నిపాల్చుక్కలు వేసి చెంచాడుమజ్జిగ పడేసుకోవే నువ్వు తినే వేలకి పెరుగన్నం అవుద్దని. అప్పుడు షటయిలుకొట్టేవు. ఇప్పుడు పస్తు పడుకుంటానంటావు"

"ఏదోలెండి నా కర్మ. మీరేం జేస్తారు".

"ఎక్స్క్యూజ్ మీ"

"ఏంటండి"

"నా కేరేజి గిన్నెలో ఇదుగో పెరుగన్నం బాగా ఎక్కువగా వుంది. సగం తీసి ఆవిడికివ్వండి. పాపం పెరుగన్నం తింటేగాని వుండలేరుగావును. కొందరికంతే. పప్పుతో తొమ్మిదీ పిండివంటలతో పదీ తిన్నా ఆఖర్న పెరుగన్నం తినకపోతే భోజనం చేసినట్టే ఉండదు".

"ఎందుకు సార్ మీకు శ్రమ?"

"ఇందులో నాకు శ్రమేముంది? ఇంటిదగ్గర కట్టిచ్చిందే. నేనింకా మూతైనా విప్పలేదు. ఇంతకీ ఈ గిన్నెలో ఇంత ఎక్కువ ఉందిగనకా ఇస్తానంటున్నాము గాని మా వాళ్ళ ఈ గిన్నెలో సగమే పెట్టుంటే నేను ఇస్తానని అన్నాలేను మీరు పుచ్చుకోవాల్సిన అవసరమూ ఉండదు. మీరు అడ్డులెండి, ఆ ఆకులో వేవాడ్డిస్తాను".

"అయిబాబో, చాలండి, చాలండి! మీకే తక్కువైపోద్ది"

"ఏం తక్కువవదు. మీరు తృప్తిగా తినండి".

"సరే మీరేమనుకోకపోతే ఇయిగో రెండు పూరీలూ కూరా ఏస్తానిందులో. ఏదీ, ఆ మూత ఇటెట్టండి"

"ఒద్దు వొద్దు, నాకు పూరీలు పడవు. ఒక్కటి చాలు"

"పోనీ రెండరిటి పళ్ళియ్యండాయనకి. అలా సూత్తారేం? కింద బుట్టలో ఉన్నై"

"ఒక్కటి చాలండీ. అయ్యో అయ్యో రెండు వేస్సేరే. ఇదంతా కదుపులో భారం అయిపోతుందేమో మొత్తానికి"

రాజమండ్రి:

"ఏంటో, వీపీ సింగారు మళ్ళా 27 పెర్సెంటు రిజర్వేషన్లంటున్నారు. బీహార్లో ఆందోళన విశాఖపట్నం దాకా పాకిరీసింది. దేశం ఏమైపోతుందో?"

"ఒక్క రిజర్వేషన్లేంటండి? ధర్లు తగ్గిస్తానన్నారు. ఏదీ? పైగా పెట్రోలుబంకులుకి టైమింగ్సెట్టారు. ఇప్పుడు ఇరాకూ కువాయిట్టూ బందైపోయేయి. ఇంక మన బళ్ళన్నీ సెడ్లలో బెట్టేస్కోడమే"

"రిజర్వేషన్లగొడవ అలా వుంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారిదాకా టెర్రరిజం, బందిపోట్లు, రేపులు"

"అవునటండి మొన్న అదేదో స్కూల్లో కిరిస్టియన్ నన్సుల్ని పాపం"

"సర్లెండి. ఏదో అర్ధరాత్రప్పుడు ఊరవతల స్కూల్లో ఏదో జరిగిందంటే పోనీ అనుకున్నాం. పట్టపగలు, మెడ్రాసునించి బొంబాయెల్తున్న దాదరెక్స్‌ప్రెస్‌లో అందరూ చూస్తుండగా సెకండ్‌క్లాస్ రిజర్వేషన్ పెట్లో ముగ్గురు కేరళీ అమ్మాయిల్ని ఎనిమిదిమంది మెడ్రాసురవుడీలు రేప్ చేసేరట. అంతకన్నా ఘోర కలెక్కడయినా వుంటుందా?"

"అవున్లెండి, పాపం... హాయ్, హాయ్, ఏంటి

భరాగో

21.9.1990



వ్వాళ ఇప్పుడే నిద్దరొస్తోందే టయిమింకా పదవ్వా కాలేదు!''

''బెర్తులేసేసుకుందామంటారా?''

''ఏం సుజాతా నిద్దరాలే?''

''ఒస్తోంది. మీరేదో మాట్లాడ్తావున్నారని''


''ఏం మాటల్లేవమ్మా. ఈ మాటలిలాగే వాళ్ల వేతలలాగే. దీనికి అంతేముంది? లేవండి బెర్తులు వేసుకుందాం''.

''ఆ! ఆ! అద్దిగది సరిగ్గా సూడండి బాబూ ఆ బటన్ రింగులో సరిగ్గా కూర్చోకపోతే పడద్ది. ఓసారి ల్లాగే కిందాయనకి తలబగిలింది''

''ఏంలేదు సరిగానే పడింది''

''నువ్వు పైకెక్కు సుజాతా, నేను మజ్జిబెర్తులో ఏస్కుంటాను''

''అయిబాబో, అంతపైన్నా? నాకు బయ్యం.




మీరీ మజ్జ బల్లమీద ఏస్కోండి. నేనిలా రెండొరసల మజ్జా సామాన్లు బెంచీలి కిందికి జరిపి నేలమీదే స్కుంటా. నాకూ బయముండదు సావాన్లా జేగర్త గుంటై''

''అదేంటమ్మా హాయిగా బెర్తు రిజర్వు చేసుకుని కూడా నేలమీద పడుకుంటానంటారు! అంతగా మీరు పై బెర్తెక్కలేకపోతే పోనీ నేను పై బెర్తులోకి వెళ్తాను మీరు లోయర్ బెర్తులో పడుకోండి!''

''తల్లి మాలచ్మి గోదారి. ఏండీ చిల్లర డబ్బులియ్యండీ, ఏస్తాను!''

''ఏంటి సుజాతా, నీకీ చాదస్తం? డబ్బులు నీళ్లలో ఏస్తానంటావేటి? ఇంద సమయానికి పది పైసలూ ఐదు పైసలన్నా లేవు. పావలా ఏసీ ఏం జేస్తాం! బిచ్చగాడికిస్తాకి ప్రేణం ఒప్పదు మల్లా''.

''తప్పు తప్పు, సెంపలేస్కోండి''

''మీకు తెల్సా? మొన్నామధ్య ఎవరో పేపర్లో రాశారు. ఈ గోదావరి నదిలో ఈ వందా ఏభై ఏళ్లనించే వేసిన చిల్లరంతా లెక్కేస్తే ఇలాటి బ్రిడ్జీలు మరో మూడు కట్టొచ్చట.

''బాగా చెప్పేరు... మీరు బెర్తుకెలిపోతున్నారా? పాపం మీకిబ్బందేమో, సారీ అండీ''

''ఏం పర్లేదు. కళ్లు మూసి తెరిచేలోగా సికింద్రాబాదు ఒచ్చేస్తుంది. ఆవిణ్ణి సుఖంగా పడుకోనియ్యండి. ఏమ్మో! తల కిటికీదగ్గిర పెట్టుకోకండి, ఇటువేపు పెట్టుకోండి. ఎవడన్నా దొంగవెధవ మెళ్లో చెయ్యిగాని పెట్టగలడు! దొంగలు బైటేగాక పెట్లో గూడా ఉండొచ్చనుకోండి''.

''అవునండో మీ పుణ్యమాని ముందే జెప్పారు''

''ఓకే గుడ్‌నైట్! ఆ లైటు తీసేండి, మీరు సెటిలవగానే''

## మౌలాలి:

''గుడ్మాణింగండి. బాగా నిద్దరట్టిందా, సార్?''

''ఓ కొట్టినట్టు పడుకున్నాను''

''కిటికీ పక్కనిలే సుజాతా, ఆయనక్కడ గూర్చుంటారు గావాల''

''నోనో. ఇక్కడ కూర్చుంటాలెండి, ఇంకెంత సేపు! ఒచ్చేశాంగా''.

''థాంక్యూసార్''.

''మీ పేరు మోదుకూరి వెంకటేశ్వర్లా?''

''అరె మీకెలా తెల్సిందండి?''

''ఎలాగేమిటి? ఇదుగో ఈ బ్యాగ్ అరలో వున్న కార్డుమీద రాసేరుగా''.

''అదా? హ్హహ్హ. మా బామ్మర్ది రాసిపెట్టాడ్లెండి''.

''అంటే మీదే ఊరు, అసలు?''

''నిడదవోల్దగ్గిర కాల్దరండి. మీదో?''

''మాది తణుకు. కానీ మా మేనమామగారు కాల్దరిలో ఉండేవారు.

''యవరండీ?''

''దోనేపూడి తిరుమలరావుగారని —''

''అయిబాబో చెప్పేరు గారు! తిర్మల్రావుగారంటే మాకందరికీ దేవుడండి. ఆరుతరాల బట్టీ వారి పొలాలు మావోళ్లేనండి చేస్త''.

''అలాగా''

''మమ్మల్నీ ఎప్పుడూ ఆ కుటుంబంవాళ్లు వ్యవసాయ కూలీల్లా సూళ్లేదండి. బాగస్తుల్లా సూసేరంతే. చెయ్యెత్తి దంణమెట్టాల''

''ఏమిటో, ఆ రోజులే వేరు. మీరిప్పుడు వైజాగ్‌లో ఉంటున్నారా?''

''లేదండి నాకు హైదరాబాద్‌లో చిన్న వర్క్‌షాపుందండి. మా బామ్మర్దిగారింటికెల్తొస్తున్నాం. తమరు వైజాగాండి?''

''మరేనండీ షిప్‌యార్డులో సూపర్‌వైజర్నండి నేను''

''అయ్‌బాబో, అయ్‌బాబో! రాత్రల్లా చెప్పేరేగాదు. ఎవరా ఎవరా అని చూస్తున్నాను. తిర్మల్రావుగారింటి కొస్తాపోతా వుండేవారేనా?''

''ఆ! మరి మా మేనమామగారే కదా ఆయన!''

''ఈసారొచ్చినప్పుడు తమ దర్శనం జేస్తాం. డి. తమరి ఎడ్రసూ అదీ ఇయ్యండి. ఏదీ సుజాతా రాత్తిరి నీకు కాయితం ఇచ్చాను. దాని ఎనకపక్క కాళీవుండాల''.

''అక్కర్లేదు. నేను రాపిస్తాను. హైదరాబాద్‌లో మీది ఏం వర్క్‌షాపు?''

''కుంచెం పెద్దదేనండి. పతేనగర్ గేటు దగ్గిర ఎమ్.వి.ఎమ్.వి షాపని ఉంటాదండి. లేతు మిషనూ గ్రైండింగూ, కటింగూ ప్లేట్ వెల్డింగూ, ఫాబ్రికేషనూ అన్నీ ఉన్నాయండి''

''అలాగా? మా తమ్ముడు హైదరాబాద్‌లో ఇల్లు కడ్తున్నాడు. గేట్లూ కిటికీలు ఫాబ్రికేషను చేయించాలి. మీ దగ్గిరికి పంపిస్తాను. ఎం.వి.ఎం.వి అన్నారా?''

''అవునండి. ఎమ్.వి.ఎమ్.వి షాపు అంటే మోదుకూరి వెంకటేశ్వర్లు మెకానికల్ వర్క్‌షాపు అన్న మాటండి''

''బలే బాగా పెట్టేరే పేరు! ఓకే సికింద్రాబాద్ వచ్చేస్తోంది దిగిపోతాం''

''మళ్లీ కలుద్దామండి తమ్ముడుగార్ని పంపండి''

''తప్పకుండాను''


## ఆటోస్టాండు దగ్గిర:

''అబ్బెగండి, మేం మీకన్నా ముందొచ్చాం''

''నో. వుయ్ కేమ్ ఫస్ట్''

''సర్లేవయ్యా. నీకన్నా ముందే సామానెట్టాం ఆడకూతుర్ని నిలబెట్టాం. లైన్లో రావటం తెలీదుగాని పెద్ద యింగిలీషు మాట్లాడ్తన్నావు. లెగు, లెగు, ఆ వొచ్చే ఆటో మాది!''

''మిమ్మల్నెక్కడో చూసినట్టుందే!''




### ముందు జాగ్రత్త

మాష్టారు: ఓరేయ్ రాము నిజమైన గాంధేయ వాది లక్షణం ఒకటి చెప్పరా?

రాము: ఎవరైనా కొడ్తారని ముందు జాగ్రత్తగా చేతిలో కర్ర పట్టుకు తిరిగేవాడు సార్!



## నయం

" దోమకంటేనల్లి నయంరా'' చెప్పాడు వీర్రాజు.

"ఎందుకు?'' ప్రశ్నించాడు రామరాజు

"దోమ కుట్టి పారిపోతుంది! నల్లిదొరికి చస్తుంది'' వివరించాడు వీర్రాజు.

రాయవరపు రవి, రామాయంపేట

''అరె! అరె! ఏంటి సుబ్బారావుగారే? ఏంటి ఇన్నాళ్లా నల్లపూసైపోయారే! బిల్డింగ్ కాంట్రాక్టు లాగిపోయాయా?''

''నోనో. వేరే కంపెనీలో చేరాన్లెండి. మీ వర్క్ షాప్ బాగా నడుస్తోందా?''

''ఏదో అలాగలాగండి. మీలాంటోళ్ల దయలేదు మరి. రెండేళ్లు దాటింది. మీ చేత్తో మీరేదన్నా ఆర్డరిచ్చి... ఒస్తానండి. లేడీస్ వెయిట్ చేస్తున్నారు. మీ పాత కంపెనీ కెళ్తే మీ యద్రసిస్తారుగా?''

''ఓ వెల్కమ్''

''థాంక్యూసార్. పోనీవోయ్ ఆటో! చెప్పాగా ఫతేనగర్ గేటు!''

### ఆటోలో

''ఎందుకు అన్ని అబద్ధాలాట్టం?''

''అబద్ధాలేంటి అదంతా ఎవహారం''

''మీ వూళ్లో ఆ దోనేపూడారి పొలాలన్నీ కమతం జేసి కాజేసిందిగాక ఏదో పెద్దమనిసిలా ఆయన దేవుడంట. బాగస్తుల్లా జూసేరంట... చెయ్యెత్తి దండంమెట్టాలంట. మీవోళ్లంతా నమ్మినోళ్లని దగా జేటమేగా''

''నోర్ముయ్యహె. నమ్మకపోతే దగా ఎల్లా చేస్తాం?''

''ఆ సుబ్బారావుగారి మీద రిపోటుజేసి ఆయనుద్యోగం పీకించి మళ్లా ''

''ఇదుగో తంతా నేననుకున్నావో. నీ పని ఇక్కడ గాదు ఇంటికెళ్ళి జెప్తా''

''అంతేలే. మోసమన్నా జెయ్యాలి, లేకుంటే తన్నాలి. అందికే ఈ పరిచెయాలూ నేవితాలూ''.




పుష్పపలాత అనే కొచ్చిన్ మహిళ 14—2—90నాటి ''వైవ్స్ ఆఫ్ ఇండియా' లో వ్రాసిన ఈ కథలో వాస్తవంలేకపోలేదు. కాని వాస్తవికతతోపాటు కల్పన మేళవింపబడింది. ప్రస్తుతం ఈ కథ విస్మయం కల్గించడం మాత్రం నిజం.

ఇది పుష్పస్వీయానుభవంకాదు. ఆమె ముత్తవ్వగారి ముత్తవ్వ బాల్యంలో జరిగిన కథ. ఆనాడు కొచ్చిన్ ఒక స్వదేశీ సంస్థానం. శత్రుసేన సంస్థానంలోకి చొచ్చుకు వస్తున్నదన్న వార్త ఎంతో సంచలనం కల్గించింది. సంస్థానంలోని ఒక వూళ్ళోని సంఘటన ఇది. ఊరి పెద్దలు ఒక పాత ఇంట్లో సమావేశమయ్యారు. చాలామంది ఊరు వదలి పారిపోయారు భయంతో. ఆ పాత ఇంటి చుట్టూదట్టంగా మామిడితోట. శత్రుసేనాని మనస్తత్వాన్ని, ఇటు ఆత్మరక్షణా వ్యూహాన్ని బేరీజు వేసుకుని, అసామాన్యమూ, అపూర్వమూ అయిన నిర్ణయానికొచ్చారు.

పాతఇంట్లో వున్నవారు శత్రుసేనను తిప్పికొట్టడానికి సిద్ధమయ్యారు. ఊళ్ళోవున్న రక్షకభటులు వారికి అండగా వున్నారు. అంతలో ఒక బాలుడు పరుగెత్తుకుని వచ్చి శత్రుసేన సమీపిస్తున్నట్లు తెల్పాడు.

గుర్రాల డెక్కల చప్పుళ్ళు, వాటి సకిలింపులు నిమిషాల్లో ఆ పరిసరాలను భయంకరంగా మార్చాయి. పాత ఇంటికి వెళ్ళే దారిలో విపరీతంగా దుమ్ము ధూళి రేగింది. సేనాని ముందుగా వెళ్తూ అమాంతంగా గుర్రాన్ని ఆపిదిగాడు. బయటికి తీసిన ఖడ్గాన్ని మరలా ఒరలోకి తోశాడు. పాదచారియై మొదటి వ్యూహం సమీపించాడు. అక్కడో ఊయల, ఆ ఊయల్లో 30 రోజుల పసిపాప! మరో మూడడుగులువేశాడు మరో ఊయల్లో కూడా పసిపాప! వరుసగా కొయ్య ఊయలలు! కొన్ని పాపలు కిలకిల మంటూ నవ్వుతున్నాయి. కొన్నేమో ఏడుస్తున్నాయి. సేనాని అలా కళ్ళప్పగించి చూస్తూ నిశ్చేష్టుడయ్యాడు. చుట్టూ కలయచూచాడు. ఎవరూ లేరు. ఒకసైనికునిపిల్చి ఊయలలను లెక్కించమన్నాడు. వాడు 'హుజూర్' ఇరవై అన్నాడు.

సేనాని తన ఒరనుండి కత్తిని లాగి, సమీపంలోని గోడపై '20' సంఖ్య గీచాడు కత్తి మొనతో. పాపల జోలికి పోవద్దని సైనికులను ఆదేశించాడు. నవ్వుతూ సైన్యంతో తిరిగి పోయాడు.

నాటినుండి ఆ పాత ఇంటికి ఆపరిసరాలకు 'ఇరవద్' అన్న పేరుపడింది. ఇరవద్ అంటే మలయాళ భాషలో 20.

మొదటి వ్యూహాభిమన్యుగా సేనాపతిని ఎదురించిన 30 రోజుల పాప, రచయిత్రి పుష్పపలాత ముత్తవ్వగారి ముత్తవ్వ! ఆ సేనాపతి— టిప్పుసుల్తాన్!

(శ్రీ గౌరీశ్ కైకిణి రచన ఆధారంగా)

— జొనమద్ది హనుమచ్ఛాస్త్రి